నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# నల్లగొండ

శనివారం 2 డిసెంబర్ 2023
SATURDAY, DECEMBER 2, 2023

NALGONDA

పేజీలు : 8
PAGES




సూర్యాపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

# కౌంటింగ్‌కు చకచకా ఏర్పాట్లు

## నియోజకవర్గానికి ఒక హాల్ కేటాయింపు

- పోలింగ్ కేంద్రాలు బట్టి రౌండ్ల సంఖ్య స్పష్టం
- ఉదయం 8గంటల నుంచి లెక్కింపు మొదలు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, ఆ తర్వాత ఈవీఎంలు
- సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి
- నల్లగొండ జిల్లా ఓట్ల లెక్కింపు
- అనిశెట్టి దుప్పలపల్లిలోని గోదాములో..
- సూర్యాపేట జిల్లాది స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో..
- స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత, సీసీ కెమెరాల నిఘా

ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు

4లో..







నల్లగొండ జిల్లా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న దుప్పలపల్లిలోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాము

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలైంది. నల్లగొండ జిల్లా ఓట్ల కౌంటింగ్‌కు తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో, సూర్యాపేట జిల్లా కౌంటింగ్‌కు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గానికి ఒక హాల్ చొప్పున మొత్తం ఆరు కౌంటింగ్ హాల్స్‌ను సిద్ధం చేశారు. ఒక హాల్‌లో మొత్తం 14 కౌంటింగ్ టేబుళ్లను ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు కోసం, ఒక టేబుల్‌ను పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం వినియోగించనున్నారు. ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 14 ఈవీఎంలలో నిక్షిప్తమైన ఉన్న ఓట్ల లెక్కింపు పూర్తి కానున్నది. ఇలా ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి 19 రౌండ్ల నుంచి 23 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. ఇక ఇప్పటికే సిబ్బందికి శిక్షణ, కౌంటింగ్ హాళ్లల్లో వసతుల కల్పన పూర్తయ్యింది. రేపు ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో మొదలయ్యే కౌంటింగ్ మధ్యాహ్నం ఒంటి గంట లోపే పూర్తి స్థాయి ఫలితం వెల్లడికావచ్చని భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో 144 మంది అభ్యర్థులు బరిలో నిలువగా 85.71శాతం, సూర్యాపేట జిల్లాలో 92 మంది పోటీలో ఉండగా 84.83 శాతం పోలింగ్ నమోదైంది.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్1(నమస్తే తెలంగాణ)

# నల్లగొండ జిల్లా తుది పోలింగ్ 85.71%

2018తో పోలిస్తే 1.11శాతం తగ్గుదల

మధ్య పేజీల్లో..

## రాష్ట్రంలోనే 91.89 శాతంతో మునుగోడు టాప్



- అత్యధికంగా అప్పుడు ఇప్పుడూ రికార్డు
- అత్యల్పంగా నల్లగొండలో 81.60 శాతం
- 14,64,080 ఓట్లకు గానూ 12,54,799 మంది ఓటింగ్
- మహిళల కంటే పురుషులే ఎక్కువ

నల్లగొండ జిల్లాలో 2018 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ 1.11శాతం తగ్గింది. ఈ సారి తుది పోలింగ్ 85.71శాతం నమోదైంది. గురువారం కొన్నిచోట్ల రాత్రి 8గంటల వరకు కూడా పోలింగ్ జరుగడంతో అన్ని నియోజకవర్గాల నుంచి పోలైన ఫైనల్ ఓట్ల సంఖ్య తేలేసరికి అర్ధరాత్రి దాటింది. దాంతో శుక్రవారం ఉదయం అధికారులు తుది పోలింగ్ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోనే మునుగోడులో అత్యధిక పోలింగ్ నమోదు కావడం విశేషం. ఇక్కడ పోలైన ఓట్ల శాతం 91.89 కాగా ఇది 2018 కంటే కూడా ఎక్కువ. ఇక నల్లగొండలో నమోదైన 81.60శాతమే అత్యల్పం. పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఓటింగ్‌కు మాత్రం పురుషులే ఎక్కువ హాజరయ్యారు. జిల్లా మొత్తం ఓటర్లు 14,64,080 కాగా ఇందులో 12,54,799 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. తుది పోలింగ్ లెక్కలు ఇలా ఉంటే ఆయా పార్టీల అభ్యర్థులు మాత్రం ఓటర్ల మనోగతంపై మళ్లగుల్లాలు పడుతున్నారు. పోలింగ్ కేంద్రాలు, గ్రామాలు, మండలాల వారీగా తమ పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా పనిచేసిన నేతలు, అనుచరులతో చర్చలు జరుపుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్1(నమస్తే తెలంగాణ)

# సాగర్ డ్యామ్‌పై హైటెన్షన్

## రెండో రోజూ కొనసాగిన ఉద్రిక్తత

- తెలంగాణ వైపు భారీ పోలీసు బలగాల మోహరింపు
- మరోవైపు చర్చలు జరుపుతున్న ఇరిగేషన్ అధికారులు
- ఆంధ్రా ఇరిగేషన్, పోలీసులపై నందికొండలో కేసులు నమోదు
- కేంద్రం నుంచి కూడా అదనపు బలగాలు రాక

2లో..



సాగర్ డ్యామ్ 13వ గేట్ వద్ద ఆంధ్ర అధికారులు, పోలీస్ బలగాలు ఏర్పాటు చేసిన ముళ్లకంచెలు, బారికేడ్లు

నాగార్జునసాగర్ డ్యామ్‌పై గురువారం రాత్రి ప్రారంభమైన ఉద్రిక్తత శుక్రవారం కూడా కొనసాగింది. ఆంధ్రా అధికారులు సుమారు 1,000 మంది పోలీస్ బలగాలతో డ్యామ్ గేట్లను బద్ధలు కొట్టి, డ్యామ్‌పై విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ఎస్‌పీఎఫ్ పోలీసులపై దాడి చేసి ఫోన్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. బారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పాటు చేసి 13వ గేట్ అవతల ఉన్న కంట్రోల్ రూమ్‌కు తెలంగాణ అధికారులు, పోలీసులను వెళ్లకుండా చేశారు. దౌర్జన్యంగా కుడికాల్వ గేట్లను తెరిచి నీటిని విడుదల చేసుకుంటున్నారు. డ్యామ్ పైన ఆంధ్రా అధికారులు, పోలీస్ బలగాలను తిప్పి పంపడానికి 1,500 మంది పోలీసు బలగాలను తెలంగాణ ప్రభుత్వం మోహరించింది. కేంద్ర బలగాలు కూడా శుక్రవాం రాత్రి డ్యామ్ వద్దకు చేరాయి. మరోవైపు సమస్య పరిష్కారానికి తెలంగాణ ఇరిగేషన్ అధికారులు, ఆంధ్రా అధికారులతో చర్చలు జరుపుతున్నారు. కుడి కాల్వ ద్వారా నీటి విడుదల ఆపాలని ఆంధ్రా ప్రభుత్వానికి కృష్ణా రివర్ బోర్డు ఆదేశాలను జారీ చేసినా పట్టించుకోలేదు. ఇక డ్యామ్ పైన ఉద్రిక్త వాతావరణం నెలకొల్పిన ఆంధ్రా అధికారులు, పోలీసులపై తెలంగాణ డ్యామ్ ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదుతో నందికొండ పైలాన్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

– నందికొండ, డిసెంబర్ 1